@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || గురువారం 22, ఆగస్ట్ 2024 || పేజీలు: 04




## హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

### జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై పిటిషన్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 21:

**జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు** చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధుల గురించి చెప్పాలని ఏఏజీకి ఉన్నత న్యాయస్థానం సూచించింది. ఈక్రమంలో హైడ్రా స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ అని ఏఏజీ పేర్కొన్నారు. మరోవైపు హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నించింది. స్థల యజమానులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారని తెలిపింది. స్థానిక సంస్థల అనుమతితో నిర్మాణాలు జరుగుతాయని పేర్కొంది. 15–20 ఏళ్ల తర్వాత హైడ్రా మిగతా 2లో..



## పారదర్శకంగా, వేగంగా.. భూసేకరణ

### పనులకు సంబంధించి ఏరోజుకు ఆరోజు వివరాలందించాలి

### దక్షిణ ప్రాంతంలో భూసేకరణకు దిగాలి

### ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్లు తదితర పనులపై ఆరా..

### ఆర్ఆర్ఆర్‌పై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 21:

**రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం భూసేకరణను** పారదర్శకంగా, వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు.. పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనకు అందజేయాలన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి మిగతా 2లో..

## జన్వాడ ఫామ్‌హౌజ్ లీజు మాత్రమే

### నాకు సొంతంగా ఫామ్‌హౌజ్‌లు లేవు

- అది అక్రమమైతే దగ్గరుండి కూల్చేయిస్తా
- మంత్రుల పామ్ హౌజ్‌ల నుంచే కూల్చివేతలు సాగాలి
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ డిమాండ్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 21:



**జన్వాడ ఫామ్ హౌస్ అక్రమంగా** ఉంటే కూల్చేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కేవలం తాను లీజుకు మాత్రమే తీసుకున్నానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కూల్చివేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో స్పందించారు. తన పేరుతో ఫామ్ హౌస్ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మిత్రుడికి చెందిన ఫామ్ హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. గత కొన్ని నెలలుగా తాను అక్కడే నివసిస్తున్నట్లు చెప్పారు. జన్వాడ లోని ఈ ఫామ్ హౌస్ నిబంధనల ప్రకారం లేకుంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ ఫామ్‌హౌస్ నిర్మించి ఉంటే.. దానిని కూల్చివేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని కుండ బద్దలు మిగతా 2లో..



## పెను విషాదం

- ఫార్మా కంపెనీలో భారీ పేలుడు..
- 18మంది దుర్మరణం
- 20మందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

అచ్యుతాపురం, (నేటి ఫోకస్‌న్యూస్)–ఆగస్ట్ 21:

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో పెను విషాదం చోటు చేసుకుంది. భారీ జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని చెబుతున్నారు. ప్రాణనష్టం పరంగా 'ఫార్మా' చరిత్రలోనే అతి భారీ ప్రమాదమిది. మిగతా 2లో..



## కేటీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి వచ్చా

- తెలంగాణ కోసం రోడ్డెక్కి ఉద్యమం చేశాం
- పొంగులేటికి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం ఉన్న విషయం తెలియదా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

➤ వివరాలు 02లో..

## వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్

- దేశంలో అముందస్తు చర్యలకు దిగిన కేంద్రం
- కరోనా అంత ప్రమాదకారి కాదన్న ఆరోగ్య సంస్థ

➤ వివరాలు 02లో..






## దేవుడిపై ఒట్టేసి మాట తప్పిన సీఎం

### రేవంత్ పాప పరిహారం కోసం ప్రార్థిస్తా

- రుణమాఫీ పేరుతో దేవుళ్లపై ఒట్టేసుకున్న సిఎం
- తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం యాదాద్రిలో ప్రత్యేక పూజలు చేయిస్తా..
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

2



## కల్యాణలక్ష్మికి రూ.1450 కోట్లు విడుదల

- తాజాగా దరఖాస్తు చేసుకున్న వారికి చెల్లింపులు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

2

# పారదర్శకంగా, వేగంగా భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి..)

విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ పక్రియ ప్రారంభం,ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి, ఆమన్‌గల్, షాద్‌నగర్,చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు



విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

# హైడ్రా కూల్చివేతలపై హైకోర్టు ప్రశ్నలు

(మొదటి పేజీ తరువాయి..)

వచ్చి అక్రమ నిర్మాణమంటూ కూల్చివేయడ మేంటని న్యాయస్థానం ప్రశ్నించింది. మరోవైపు చెరువుల పరిరక్షణ కోసమే హైడ్రా ఏర్పాటైందని ఏఏజీ తెలిపారు. ప్రదీప్‌రెడ్డి వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని చెప్పారు. జన్వాడలో ఉన్న ఫాంహౌస్ జీవో 111లోకి వస్తుందని పేర్కొన్నారు. జీవో 111 పరిధిలోని భూములు, ఫాంహౌజ్‌లు నీటిపారుదల శాఖ చూస్తోందని వివరించారు. వీటిని కూల్చివేసే హక్కు హైడ్రాకు లేదని ఏఏజీ తెలిపారు. కూల్చివేతల గురించి చర్చించాల్సి ఉందని హైకోర్టు తెలిపింది. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. యజమాని ప్రదీప్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు, శంకర్‌పల్లి తహసీల్దార్, చీఫ్ ఇంజినీర్‌ను చేర్చారు. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో తన ఫాంహౌస్, పొలం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 14న నా ఫాంహౌస్‌ను నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాంహౌస్ లేదని ఆధారాలు చూపించాను. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మాణం ఉందని అధికారులు వాదించారు. 2019లో ఫాంహౌస్‌ను కొనుగోలు చేశాను. రాజకీయ కారణాలతో నా ఆస్తికి నష్టం చేయాలని చూస్తున్నారు అని ప్రదీప్‌రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది.

# జన్వాడ ఫామ్‌హౌజ్ లీజు మాత్రమే

(మొదటి పేజీ తరువాయి..)

కొట్టారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కెవిపి రామచంద్రరావు, మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ తదితరులకు ఫామ్ హౌస్‌లున్నాయన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ ఎక్కడ ఉందో కూడా తాను చూపిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా ఉందని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. పొంగులేటి సోదరుడు ప్రస్తుతం అదే ఫామ్ హౌస్‌లో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించారా? అంటూ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లోని కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్ళి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్ హౌజ్ం ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒక వేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. ముందు మంత్రుల ఫామ్ హౌస్‌ల కూల్చివేతతోనే వీటిని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు జన్వాడలో ఫామ్ హౌస్ కూల్చవద్దంటూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత ప్రదీప్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగర శివారుల్లో పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వీటిపై హైడ్రా ఫోకస్ పట్టింది. ఈ ఫామ్ హౌస్‌లు నిబంధనల మేరకు నిర్మించారా? లేక 111 జీవోను ఉల్లంఘించారా? అనే కోణంలో ఓ వైపు హైడ్రా, మరోవైపు ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి.. వివరాలు సేకరిస్తున్నారు. ఓ వేళ నిబంధనలు పట్టించుకోకుండా నిర్మిస్తే... వాటిని కూల్చివేసేందుకు ఐపీఎస్ అధికారి ఎ.వి.రంగనాథ్ సారథ్యంలో 'హైడ్రా' తన పని తాను చేసుకొంటూ ముందుకు వెళ్తుందనే ఓ చర్చ సైతం సాగుతుంది.

# కేటీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి వచ్చా..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 21:

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయనే విషయం తనకు తెలియదని, ఎందుకంటే ఆయన ఉండేది హైదరాబాద్‌లో... ఆయనకు ఇక్కడే ఇల్లు ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్‌లో పొంగులేటికి నిర్మాణం ఉందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి తీవ్రంగా స్పందించారు. జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌దే అన్నారు. మీడియా వస్తే తాను తీసుకెళ్లి చూపిస్తానన్నారు. తాను కేటీఆర్ ఫామ్ హౌస్‌కు వెళ్లానని... అక్కడ ఆయన భార్య పనులు చేయిస్తోందన్నారు. జన్వాడలో ముఖ్యమంత్రికి ఫామ్ హౌస్ లేదని చురక అంటించారు. ఒక మంచి ఆలోచనతో హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సినిమా వాళ్ల ఇళ్లు, రాజకీయ నాయకుల ఫామ్ హౌస్‌లు... ఇలా అందరివీ తొలగిస్తామన్నారు. తాను కేటీఆర్ ఫామ్ హౌస్‌కు వెళ్లానని... అక్కడ ఆయన భార్య పనులు చేయిస్తోందన్నారు. జన్వాడలో ముఖ్యమంత్రికి ఫామ్ హౌస్ లేదని చురక అంటించారు. ఒక మంచి ఆలోచనతో హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సినిమా వాళ్ల ఇళ్లు, రాజకీయ నాయకుల ఫామ్ హౌస్‌లు... ఇలా అందరివీ తొలగిస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేటీఆర్ ఒక్క లాఠీ దెబ్బ తిన్నారా? అని నిలదీశారు. తాము తెలంగాణ కోసం ఉద్యమించామని... కానీ కేసీఆర్‌లా ఆసుపత్రిలో ఉద్యమం చేయలేదన్నారు. తాము రోడ్డెక్కి ఉద్యమించామన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ అనడం ఏమిటని మండిపడ్డారు. రాజీవ్ విగ్రహాన్ని టచ్ చేస్తే మరుక్షణమే బీఆర్ఎస్ కార్యాలయాలు, ఫామ్ హౌస్‌లు పునాదులతో సహా గాల్లో కలుస్తాయని హెచ్చరించారు. సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లోనే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు భారీగా తగ్గాయని, అలాంటిది తాము అధికారంలోకి వస్తామని కేటీఆర్ అంటే నవ్వొస్తుందన్నారు. కేటీఆర్‌ను ఇక నుంచి బీజేపీ నేత కేటీఆర్ అనాలని ఎద్దేవా చేశారు. కుటుంబం కోసం బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారని జోస్యం చెప్పారు.

# వేగంగా విస్తరిస్తున్న మంకీపాక్స్

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 21:

మంకీపాక్స్ వేగంగా వ్యాపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతోంది. పొరుగుదేశాల్లోనూ కేసులు నమోదవడంతో... కేంద్రం మరింత అప్రమత్తమైంది. దాయాది దేశం పాకిస్తాన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేకాదు.. పాక్ ఆక్రమిత కశ్మీర్ లోనూ ఒక ఎంపాక్స్ కేసు వెలుగుచూసింది. సౌదీ నుంచి పీఓకే కి వచ్చిన ఒక వ్యక్తిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో.. కేంద్రం హైలర్ట్ ప్రకటించింది. ఎయిర్‌పోర్టులు, దేశ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు చేపడుతోంది. ఎంపాక్స్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఊరటనిచ్చే విషయం చెప్పింది. కోవిడ్‌లా.. మంకీపాక్స్ ప్రమాదకర వైరస్ కాదని తెలిపింది. ఈ వైరస్ వ్యాపిని నియంత్రించే అవకాశాలు ఉన్నాయిని చెప్పింది. కోవిడ్ సమయంలో వ్యవహరించినట్టే.. ఎంపాక్స్ విషయంలోనూ అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని.. వైరస్ వ్యాప్తిని కట్టడి చేయగలిగితే.. ఎంపాక్స్‌ను కూడా తరిమేయొచ్చని చెప్పింది ప్రపంచ ఆరోగ్య సంస్థ. మంకీపాక్స్ లక్షణాలతో వచ్చే ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది. దేశంలో ఎంపాక్స్ కేసులు బయటపడితే.. చికిత్స కోసం మూడు ఆస్పత్రులను నోడల్ వైద్య కేంద్రాలుగా ప్రకటించారు. వాటిలో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రి ఒకటి. రెండోది సఫ్దర్‌గంజ్ ఆస్పత్రి, మూడోది లేడీ హార్డింగ్ హాస్పిటల్. ఈ ఆస్పత్రుల్లో.. మంకీపాక్స్‌కు చికిత్స అందించనున్నారు. అందు కోసం ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రాల్లోనూ నోడల్ కేంద్రాలను గుర్తించి.. ఎంపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. భారత్ దేశంలో గతంలో ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. అయితే.. ప్రపంచవ్యాప్తంగా వైరస్ ప్రబలుతున్న ఈ దశలో కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గత ఏడాది జులై నాటికి.. దేశంలో 27మంకీపాక్స్ కేసులున్నాయని.. పార్లమెంట్‌లో నాటి కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సింగ్ బఘేల్ ప్రకటించారు. ఈ 24లో.. 15కేసులు ఢీల్లోలో.. 12కేసులు కేరళలో ఉన్నట్టు చెప్పారు. అయితే... ఇప్పుడు మళ్లీ వైరస్ విజృంభిస్తోంది. ఎంపాక్స్ ప్రమాదకరంగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ క్రమంలో.. దేశంలో మళ్లీ ఎంపాక్స్ కేసులు విజృంభించే అవకాశాలు ఉన్నాయి. అందుకే కేంద్రం అలర్ట్ అయ్యింది. వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని.. వైరస్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఫోకస్ పెట్టింది. దేశంలో వైరస్ వ్యాపి కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీని నమోదు చేయడం చాలా అవసరం. ముఖ్యంగా.. ఎంపాక్స్ కేసులు ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వాళ్లలో ఎవరికైనా ఎంపాక్స్ లక్షణాలు అంటే... జ్వరం, ఒంటిపై దద్దర్లు వంటిని ఉన్నాయేమో టెస్ట్ చేయాలని. అందుకు.. ఎయిర్‌పోర్టుల్లో టెస్టింగ్ సెంటర్లు పెంచాలి. మంకీపాక్స్ సోకిన వాళ్లకు కనిపించే ముఖ్యమైన లక్షణం ఒంటిపై దద్దుర్లు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కండరాల నొప్పులు, వెన్నునొప్పి, మనిషి బలహీనపడటం, రోగ నిరోధక శక్తి తగ్గడం వంటివి ఉంటాయి. ఒంటిపై దద్దుర్లు పండుగా మారి... చీముతో నిండిన గాయంగా మారుతుంది. పుండ్లు మానిపోయి కొత్త చర్మం ఏర్పడే వరకు.. ఈ వ్యాధి ఇతరకు వ్యాపించే అవకాశం ఉంటుంది. కొంతమందిలో ఒంటిపై దద్దుర్లు ముందుగా కనిపిస్తే... మరికొందరిలో మరో లక్షణం బయటపడుతుంది. వ్యాధి సోకిన వారికి సన్నిహితంగా ఉంటే... వారిలో వారం రోజుల్లో వైరస్ లక్షణాలు కనిపిస్తాయి. కొంతమందిలో 21 రోజుల్లో కూడా కనిపించవచ్చు. వైరస్ సోకిన తర్వాత రెండు నుంచి నాలుగు వారాల పాటు.. వ్యాధి లక్షణాలు ఉంటాయి.

# కల్యాణలక్ష్మికి రూ.1450కోట్లు విడుదల

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 21:

కల్యాణలక్ష్మి పథకం కోసం ప్రభుత్వం రూ. 1450 కోట్లు విడుదల చేసింది. 2024- 25 సంవత్సరానికి గాను నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొంది. కల్యాణలక్ష్మి కోసం తాజాగా దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నిధుల నుంచి చెల్లింపులు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ బుధవారం జీవో జారీ చేసింది. కాగా, ఈ పథకం కింద లబ్ధిదారులకు రూ. 1,00,116 ప్రయోజనం అందుతుంది.

# పెను విషాదం

(మొదటి పేజీ తరువాయి..)

అది అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా సంస్థలో బుధవారం మధ్యాహ్నం తొలి షిఫ్టు కార్మికులు విధులు ముగించుకుని వెళ్తుండగా... దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. కొన్ని నిమిషాల్లోనే భారీ పేలుడు సంభవించింది. దీని తీవ్రతకు శ్లాబ్, గోడ కుప్పకూలిపోయాయి. ఒకదాని వెంట మరొకటిగా జరిగిన ఘటనలతో కార్మికులు కకావికలమయ్యారు. పేలుడు ధాటికి కొందరి శరీరాలు తుత్తునియలయ్యాయి. శ్లాబ్ శిథిలాల కింద కొందరు నలిగిపోయారు. చుట్టూ దట్టమైన పొగ అలుముకోవడంతో... ఎటుపోతున్నామో తెలియకుండా పరుగులు తీస్తూ గోడలకు తగిలి, మెట్లపై నుంచి కొందరు కింద పడిపోయారు. ఈ మూడు కారణాలతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. 'ఎసెన్షియా'లో ఒక్కో షిఫ్టులో 80 మంది కార్మికులు పని చేస్తారు. సరిగ్గా ఏ-షిఫ్టు సిబ్బంది బయటికి వెళ్తూ... బి-షిఫ్టు కార్మికులు లోపలికి వెళ్లేటప్పుడే ఈ ఘోరం జరిగింది. మరో ఐదు నిమిషాలు ఉంటే తొలి షిఫ్టు కార్మికులు మొత్తం బయటికి వచ్చేవాళ్లు. రెండో షిఫ్టు సిబ్బంది వాహనాలు దిగి కర్మాగారం ప్రధాన గేటు దాటి వెళుండగా ఈ పేలుడు జరిగింది. దీంతో బయట ఉన్న కార్మికులు పరుగులు తీశారు. కొందరు ధైర్యం చేసి కర్మాగారం లోకి ప్రవేశించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, కర్మాగారం బస్సుల్లో అచ్యుతాపురంలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. ఘాటైన వాసనలతో కూడిన దట్టమైన పొగ కర్మాగార భవనం మొత్తం ఆక్రమించడంతో సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. ప్రమాదం మధ్యాహ్నం జరిగినా దట్టమైన పొగలు కమ్ముకోవడం, వాటిని పీల్చినవారు అస్వస్థతకు గురి కావడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తప్ప ఇంకెవరూ లోపలకు వెళ్లలేకపోయారు. రాత్రి చీకటి పడేంత వరకు గాయపడిన వారిని అంబులెన్సుల్లో తరలిస్తూనే ఉన్నారు. ఎన్డీఆర్ఎఫ్ రంగంలోకి దిగిన తర్వాతే సహాయ చర్యలు ఊపందుకున్నాయి. అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ ఎం.దీపిక సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. సాయంత్రం 5గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి.

# ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలి

**శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై మాల సంఘాల నేతలు ఆధ్వర్యంలో రాస్తారోకో**

**- ఆర్టికల్ 41 ప్రకారం ఎస్సీలను విభజించే అధికారం సుప్రీంకోర్టుకు లేదు**

**- తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనుపోతుల కర్ణ...**

ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-చారగొండ వెంకటేష్ ఆగస్టు 21:

ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని శ్రీశైలం హైదరాబాదు ప్రధాన రహదారి అంబేద్కర్ చౌరస్తాలో మాల సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిరసన కార్యక్రమం నిర్వహించి రోడ్డు నిర్బంధ చేశారు. బుధవారం అచ్చంపేట నియోజకవర్గం లోని అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామం లో అంబేద్కర్ చౌరస్తా లో మాల సంఘాల మీదలతో తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనుపోతుల కర్ణ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 341 భారత రాజ్యాంగం ప్రకారం విభజించే అధికారం సుప్రీంకోర్టుకు లేదని స్పష్టంగా తెలిపారు. రాష్ట్రపతి అన్ని రాష్ట్రాల గవర్నర్ల ద్వారా పార్లమెంటులో చర్చించిన తర్వాతే పార్లమెంటులో తుది తీర్పు వెలువడే విధంగా తీర్మానం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వర్గీకరణకు అనుకూలంగా ఉన్నట్లు మాదిగల వ్యవస్థాపకుడు మందకృష్ణ నే స్వయంగా ప్రధాని మోడీ దగ్గర ప్రెస్మీట్లో చెప్పారంటే, అక్కడ చట్టం పనిచేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు సంబంధం లేదని ప్రధానమంత్రి మోడీ వల్లనే వర్గీకరణ జరిగిందని ఈ సందర్భంగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రధానమంత్రి ఉన్నత పదవి లో ఉండి భారత దేశాన్ని అన్ని విధాలుగా రక్షిస్తానని రాగద్వేషాలకు అతీతంగా ఉంటానని ప్రమాణం చేసినటువంటి వ్యక్తి ఈ విధంగా ఏకపక్ష నిర్ణయం చేయడం ఎంతవరకు సమంజసం అని వాళ్ళు ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ విషయంపై రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలు ప్రతి ఒక్కరు గమనించవలసిందిగా కోరారు. ఈ వక్రీకరణమైన తీర్పును మాలలందరూ తీవ్రస్థాయిలో ఖండిస్తూ ప్రధాన జాతీయ రోడ్డుపై ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి ధర్నా నిర్వహింపజేసేందుకు ఆపసోపాలు ప్రయత్నాలు చేసినా.. మాలలంతా చైతన్యం తో ఉండి సమస్య పరిష్కరించే వరకు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామని కేంద్ర, ప్రభుత్వాలను హెచ్చ రించారు. కార్యక్రమంలో మాల సంఘాల నేతలు మద్దెల శేఖర్, అరుణ్ పాండ్యన్, పేరుమల యశ్వం త్, బాలకృష్ణ, నల్లవెల్లి యశ్వం త్, శేఖర్, జగదీష్, రాఖి, రాజేష్, ప్రభాకర్, అనిల్, కురుమూర్తి, సైదులులతోపాటు మరి కొంతమంది పాల్గొన్నారు.



# దేవుడిపై ఒట్టేసి మాట తప్పిన సీఎం

**• తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం యాదాద్రిలో ప్రత్యేక పూజలు చేయిస్తా..**

**• మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు**

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 21:

సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా చూసి రక్షించాలని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రార్థిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాప పరిహారం కోసం, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం గురువారం యాదాద్రి దేవాలయం దర్శించుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి పూజలు చేయబోతు న్నామని ఆయన చెప్పారు. ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు అని యాదగిరి నరసింహస్వామిని వేడుకుంటామమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆగస్టు15 లోగా రైతులందరికి రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టు పెట్టి మాట తప్పారు. రూ. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని డిసెంబర్ నెలలో చెప్పారు. కడుపు కట్టుకుంటే చాలు ఒక్క ఏడాదిలో రూ. 40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరిలో అన్నారు. కేబినెట్‌లో నిర్ణయించిన రూ. 31 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. మొన్నటి బ్జడెట్ కేటాయింపుల్లో రూ. 26 వేల కోట్లకు కుదించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆగస్టు15 నాడు రుణమాఫీ పూర్తయిందని చెప్పి రూ. 17 వేల కోట్లన్నారు. రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెబుతుంటే మరోవైపు మంత్రులు కాలేదు అంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తిగా జరగలేదని, మిగిలిన రూ. 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామని ప్రకటించారు. మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 17 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని అంటున్నారు. ఇందులో ఎవరి మాట నిజమో తెలియక, రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులు, కలెక్టరేట్ల చూట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కోతల ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసేందుకు రేపు ఆలేరులో నిర్వహించే ధర్నాలో పాల్గొంటాను. రైతలందరి తరుపునా ఈ ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడుగుతామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

# రైతు గర్జన మద్దతుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి





పెద్దవంగర, (నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు)-ఆగస్టు 21:

మండల కేంద్రంలోని రైతులు తమకు రుణమాఫీ కాలేదని బుధవారం చేపట్టిన ధర్నాకి మద్దతుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రుణమాఫీ ఎగ్గొట్టి రైతులతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. మొదటగా రైతు రుణమాఫీకి 49,500 కోట్లు అవసరం అని చెప్పి, మళ్లీ మాట మార్చి కేబినెట్లో 31 వేల కోట్లు సరిపోతాయని చెప్పి మళ్లీ మాట మార్చి బడ్జెట్లో కేటాయించింది కేవలం 26 వేల కోట్లు మాత్రమే ఇందులో కూడా మూడు విడతల వారీగా చివరగా చేసిన రుణమాఫీ కేవలం 17 వేల కోట్లు మాత్రమే ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి రైతులను మోసం చేస్తుందని అన్నారు. రుణమాఫీ మీద సరైన అవగాహన లేని ఈ మంత్రులు తలో మాట మాట్లాడుతున్నారు, నిన్నటికి నిన్న ఆర్థిక శాఖ మంత్రి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గారు 7000 కోట్లు మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందని ఇంకా పదివేల కోట్లు జరగాల్సింది ఉందని అనడం హాస్యాస్పదంగా ఉంది. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు తాము తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఆరు కాలం కష్టపడి పండించిన రైతుకు ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రైతుల పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది, పాలకుర్తి నియోజకవర్గం లో కనీసం పంట పండించుకునేందుకు రైతులకు సాగునీరు కూడా అందియ లేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది, వెంటనే ప్రభుత్వం దిగివచ్చి పూర్తిగా రుణమాఫీ చేసి అలాగే రైతులకు సాగునీరు అంది ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కనీసం 40 శాతం కూడా రుణమాఫీ కాకముందే రుణమాఫీ అయిపోయిందని సంబరాలు చేసుకోవడం చూస్తుంటే ఈ ప్రభుత్వం రైతుల పట్ల ఎంత దూర్మార్గ ధోరణిలో ఉందో తెలుస్తుంది.రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ కావాల్సిన రైతులు 47 లక్షల మంది ఉంటే కేవలం 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి రుణమాఫీ అయిపోయింది అని చెప్పటం హాస్యాస్పద్ధంగ ఉంది. రైతు రుణమాఫీకి ఈ ప్రభుత్వం చేసింది గోరంతా అయితే ప్రకటనలకు ఖర్చు చేసింది కొండంత ఈ ధర్నాలో పాల్గొన్న రైతులతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్థానికంగా ఉన్న బ్యాంకులోకి వెళ్లి అక్కడ అధికారులను రైతు రుణమాఫీ వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగింది..ఈ బ్యాంకులో కూడా 40 శాతానికి మించి రైతులకు రుణమాఫీ కాలేదు. పైగా ఈ ప్రభుత్వం డబ్బులు అన్ని బ్యాంకు ఖాతాలో పడి ఉన్నాయని చెప్పడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. ప్రతీ ఒక్కరైతుకి న్యాయం అయ్యే వరకు ఈ పోరాటం ఆగదు అని ప్రతీ ఒక్కరైతుకి రుణమాఫీ చెయ్యాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

## రైతు ధర్నాను విజయవంతం చేద్దాం

- అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు



ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్) చారకొండ వెంకటేష్ ఆగస్టు 21:

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈనెల 22 న. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రైతు ధర్నాను అచ్చంపేట నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండ కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 22న. రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రాలలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రైతు ధర్నాను విజయవంతం చేసి రైతులకు అండగా మనమందరం నిలబడదామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వంగూర్ మండల కేంద్రంలో నిర్వహించే ధర్నాలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా డాక్టర్ గువ్వల బాలరాజు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళ భద్రతకు పటిష్ట చర్యలు



- ఆ భద్రతను పోగొట్టేందుకు కృషి..
- రాష్ట్ర మంత్రి సీతక్క

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్ ప్రత్యేక బ్యూరో):

మహిళల్లో ఉన్న అభద్రత భావాన్ని పోగొట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారు. మహిళలకు రక్షణ, సామాజిక భద్రత కల్పించేలా మా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళా భద్రతపై సచివాలయంలో బుధవారం మంత్రి సీతక్క సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్ష, శిక్షణ ఏకకాలంలో అమలయితేనే క్రైమ్ రేట్ తగ్గుతుందన్నారు. మహిళల మీద దాడులు జరిగితే సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా ప్రజల్లో అవగాహన పెంచుతామని చెప్పారు. మహిళలపై హింస పెరగడానికి డ్రగ్స్, గంజాయి కూడా కారణమవుతున్నాయని స్పష్టం చేశారు. వాటి కట్టడి కోసం ఇప్పటికే ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు.మత్తు బానిసలపై నిఘ పెంచుతామని తెలిపారు. ఆస్పత్రుల్లో పని చేసే డాక్టర్లు కూడా అభద్రతాభావం లో ఉండటం బాధాకరమన్నారు. మహిళా డాక్టర్లకు భరోసా కల్పిం చాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తేల్చిచెప్పారు. మంత్రులు, ఉన్నతాధికారులతో త్వరలో కోర్ కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని శాఖల్లో త్వరలో ఉమెన్ సేఫ్టీ కమిటీలు వేస్తామని తెలియజేశారు. మహిళా భద్రత కోసం ప్రతి శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నామని వివరించారు. అమ్మాయిలు మహిళల భద్రత మీ బాధ్యత అని అన్ని విద్యాసంస్థలకు తెలియ చెబుతామని చెప్పారు. అమ్మాయిలను, మహిళలను గౌరవించేలా పాఠశాలల్లో పాఠాలు బోధిస్తామనీ, పబ్లిక్ ప్లేసుల్లో ఆసుపత్రిలో సీసీ కెమెరాలను పెంచేలా చర్యలు చేపడతామన్నారు. మహిళా భద్రత కోసం మా ప్రభుత్వం ప్రారంభించిన టిసేఫ్ యాప్ బాగా పనిచేస్తుందని అభినందించారు. టి సేఫ్ యాప్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. ఈ యాప్ ను ప్రారంభించేందుకు ఏడు రాష్ట్రాలు ముందు కొచ్చాయన్నారు. టి సేఫ్ యాప్ కు మరింత ప్రచారం కల్పిస్తామని చెప్పారు. ఆటోలు, క్యాబ్ ల్లో టి సేఫ్ నెంబర్లను ప్రచారం చేస్తమని వివరించారు. మహిళా భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను త్వరలో సీఎంకు సమర్పిస్తామని మంత్రి వివరించారు. ఈ సమావేశానికి మహిళా కమీషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మహిళా సహకార అభివృద్ధి కార్పోరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి,మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమీషనర్ కాంతి వెస్లీ, ఉమేన్ సేఫ్టి డీజీ శిఖా గోయల్, ఐజీ రెమా రాజేశ్వరి, సీనియర్ మహిళా ఐఏఎస్ లు అనితా రామచంద్రన్, శైలజా రామయ్యార్, ఐ అండ్ పీఆర్ కమీషనర్ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

## సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

- అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్



ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు, ఆగస్టు 21:

జనగామ జిల్లా కేంద్రం లోని ఉన్న ఏరియా ఆసుపత్రిలో మూడు నియోజకవర్గాల నుండి జనగామ నిరుపేద ప్రజలు అనారోగ్యం నుండి ఆరోగ్యవంతుల అవడానికి వస్తుంటారు ఇక్కడ సిటీ స్కానింగ్ సౌకర్యం లేక ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపిస్తూ వరంగల్ లేదా హైదరాబాద్కు రాస్తూ రోగులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు ఇక్కడ ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు వినతి ఇవ్వడం జరిగింది ఇక నిరసన కార్యక్రమాలు చేపట్టడం కూడా జరిగింది ఎంత చెప్పినా ఆచరణ లోకి రాని సిటీ స్కానింగ్ సేవలు ఇప్పటికైనా జనగామ జిల్లా కలెక్టర్ జనగామ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి సిటీ స్కానింగ్ సేవలు అందించాలి లేనిపక్షంలో పేద ప్రజల కోసం రోగుల కోసం నేను జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అను నేను మంతెన మణికుమార్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తా ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం ఎన్నోసార్లు జిల్లా కలెక్టర్ దృష్టి కూడా తీసుకువెళ్లడం జరిగింది గత 5 సంవత్సరాల నుండి సిటీ స్కానింగ్ సేవలు జనగామ జిల్లా ఆసుపత్రి లేవు అనే విషయాలు ఆలోచించండి ఎందుకు ఇంత జాప్యం జరుగుతుంది ఎవరిలో లోపం ఉంది అనే విషయాలపై ప్రభుత్వ అధికారులు గౌరవ అన్ని పార్టీలకు సంబంధించిన రాజకీయ నాయకులు ఆలోచించి సిటి స్కాన్ సేవలు ప్రజల్లోకి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నాను. పై అధికారులు వెంటనే స్పందించి సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయవలసిందిగా ఈ విషయంపై ఫోకస్ న్యూస్ స్పందన.

## తరాల వారదులు సీనియర్ సిటిజన్స్

- ఘనంగా ప్రపంచ సీనియర్ సిటిజెన్ డే వేడుకలు
- కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ

ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్-ఆగస్ట్ 22:

సీనియర్ సిటిజన్స్ తరాలకు వారసులని వారు జ్ఞానం, సంపద, సంస్కృతి, సంప్రదాయాలను ఒక తరం నుండి మరోతరానికి పంచుతున్నారని వారి బాగోగులు మనందరి బాధ్యత అని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ జన్యావుల రామకృష్ణ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని 7వ వార్డులోని బంజారా నగర్ పార్క్ వద్ద ప్రపంచ సీనియర్ సిటిజెన్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శారీరకంగా బలహీనత ఉన్న వ్యక్తుల కోసం అవగాహన మరియు స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. మొబిలిటీ ఇండియా ఎన్జీవో వారిచే సీనియర్ సిటిజన్ వారి హక్కులు మరియు విధులతో పాటు వారి ప్రయోజనాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు బిజెపి అధ్యక్షులు ప్రశాంత్, మొబిలిటీ ఇండియా ఎన్జీవో సభ్యులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# రాయిపెల్లి యాకయ్య సేవలు అభినందనీయం:ఏసీపీ పార్థసారధి



తొర్రూర్, (నేటి ఫోకస్ న్యూస్)-ఆగస్టు 21:

ఉపాధ్యాయుడిగా సామాజిక ఉద్యమకారుడుగా హరిపిరాల గ్రామానికి చెందిన రాయిపెల్లి యాకయ్య సేవలు అభినందనీయమని ఆదర్శనీయం ఆచరణీయం అని జనగాం ఏసీపీ కొండం పార్థసారథి అన్నారు. 22 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల పదోన్నతిపై ఎస్ ఏ (మాథ్స్)గా జెడ్ పి ఎస్ ఎస్ చిల్లంచెర్ల, మరిపెడ మండలంలో పనిచేస్తున్న సందర్భంగా గౌడ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆయనను సంఘ సభ్యులు అందరూ పుష్పగుచ్ఛం శాలువా మెమొంటోతో ఘనంగా సత్కరించారు. గౌడ సహకార పరపతి సంఘ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జనగాం ఏసీపీ కొండం పార్థసారధి గారు మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది బడుగు బలహీనవర్గాల పేద పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి సామాజిక చైతన్యం కలిగించడంలో యాకయ్య గారి సేవలు వెలకట్టలేనివి అన్నారు. ప్రథమంగా 18-01-2002 న మొదటి నియామకం సందర్భంలో పనిచేసిన నెల్లికుదురు మండలం ఆవులేగ తండ పాఠశాలలో చింత చెట్టు కింద పాఠశాల ను మొదలుపెట్టి క్రమంగా దానిని పాఠశాల భవనాన్ని నిర్మించడంలో పాఠశాలలో మొక్కలు పెంచడంలో ఆయన పాత్ర ఎనలేనిది ఈ సందర్భంలో అక్కడ ఆవాస ప్రాంతంలో ఉన్న ఎంతోమంది గిరిజన బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పి బదిలీపై 2006 నుండి 2015 వరకు 9 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాల చిన్న వంగరలో పని చేసిన సందర్భంలో కూడా విద్యార్థుల సంఖ్యను పెంచడంలో అదేవిధంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనలో భౌతిక వసతులు అయినటువంటి అదనపు తరగతి గదుల నిర్మాణంలో మరియు పిల్లలకి అవసరమైన బెంచీల ను సమకూర్చడంలో దాతలను సంప్రదించి చేసినటువంటి ఆయన సర్వీసు ఎంతో స్ఫూర్తిదాయకం పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షించడంలో ఆయన శ్రద్ధ ఆదర్శనీయం..

అనంతరం2015 నుండి ప్రాథమిక పాఠశాల కొమ్మనపల్లిలో 9 సంవత్సరాలు ఆయన అందించిన సేవలు విశిష్టమైనవి విశేషమైనవి పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి సహ ఉపాధ్యాయుల అధికారుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలను డిజిటలైజేషన్ చేసి ఎంతోమంది పిల్లలను గురుకులంలో సీట్లు వచ్చే విధంగా అదేవిధంగా రాష్ట్రస్థాయిలో స్పోర్ట్స్ పాఠశాలలో చేరే విధంగా సహోపాధ్యాయుల సహకారంతో ఆయన అందించిన సేవలు మాటలకందనివి వెలకట్టలేనివి ఈ రెండు దశాబ్దాల పైచిలుకు ప్రయాణంలో వృత్తి ఉపాధ్యాయుడిగా ప్రవృత్తి సామాజిక సేవకుడిగా ఆయన ఎన్నో సేవలు అందించారు తెలంగాణ ఉద్యమంలో ఆయన అందించిన మాట పాట ఎంతోమందికి స్ఫూర్తినిచ్చింది హరిపిరాల గ్రామ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ గా తొర్రుర్ జేఏసీ లో ఉద్యమాన్ని ముందుకు నడిపించిన సందర్భాన్ని ఎప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన విషయం వివిధ రకాల స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే బూట్లు కావచ్చు స్టడీ మెటీరియల్ కావచ్చు టై బెల్టు వంటివి సమకూర్చడంలో ఆయన పాత్ర మరువరానిది. ఎంవి ఫౌండేషన్ తో కలిసి అన్ని ప్రభుత్వ పాఠశాలలో సుమారు 25 లక్షల రూపాయల విలువ చేసేటువంటి పాదరక్షల పంపిణీ వంటి కార్యక్రమాలను నిర్వహించడం పిల్లల మనస్సు లో చెరగని ముద్ర అదేవిధంగా వందేమాతరం ఫౌండేషన్ లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తూ సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి ఎంతగానో కృషి చేయడం జరిగింది బాలల హక్కుల ఉపాధ్యాయ వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ గా ఆయన అందించినటువంటి సేవలు ఆదర్శనీయమైనవి లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ టీచర్స్ అధ్యక్షుడిగా యాకయ్య అందించిన విశిష్టమైన సేవలు రీజియన్ క్వ్యాస్ట్ కోఆర్డినేటర్ గా ఆయన అందించిన సేవలు మోటివేషన్ ప్రసంగాలు ఎంతోమంది విద్యార్థులకు ఆయన అందించినటువంటి మార్గదర్శకాలు యాకయ్య గారికి సమాజంలో ఎంతో గుర్తింపును తెచ్చాయి రెండు దశాబ్దాల కాలంలో యాకయ్య గారు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయన వివిధ సందర్భాలలో ఎన్నో అవార్డులు రివార్డులు పొందారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వారి చేత మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యాశాఖ చేత జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా లయన్స్ ఇంటర్నేషనల్ వారిచే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అదేవిధంగా రాష్ట్ర విద్యాశాఖచే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందడంతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సామాజిక సాంఘిక సంస్కృతిక సంస్థ చేత బెస్ట్ సిటిజెన్ ఆఫ్ తెలంగాణ అవార్డును విశాఖపట్నంలో అందుకున్నారు ఆయన సామాజికంగా చేసిన సేవలకు గుర్తింపుగా ఢిల్లీలో రామ్ విలాస్ పాశ్వాన్ చే జాతీయస్థాయిలో మహాత్మ జ్యోతిరావు పూలే అవార్డు కూడా పొందడం జరిగింది..అంతేకాకుండా ఉపాధ్యాయులకు సేవలందించడంలో ఎంతో ముందుండేవారు ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా వివిధ రకాల సందర్భాలలో మండల జిల్లా రాష్ట్రస్థాయి కార్యవర్గంలో పనిచేస్తూ అమూల్యమైన సేవలందించారు. వీటితో పాటు అధికారికంగా ప్రభుత్వ పక్షాన నిర్వహించే జనాభా గణనలోనూ మాస్టర్ ట్రేట్కనర్ గా అదేవిధంగా వివిధ సందర్భాలలో అసెంబ్లీ పార్లమెంటు సర్పంచ్ ఎంపీటీసీ మున్సిపల్ వంటి ఎలక్షన్ల నిర్వహణలో మాస్టర్ ట్రైనర్ గా పనిచేసి అటు అధికారులతోనూ ఇటు ఉపాధ్యాయులతోనూ శభాష్ అందుకున్నారు..

బెస్ట్ మాస్టర్ ట్రైనర్ గా జిల్లా కలెక్టర్ శివలింగయ్య గారిచే అవార్డు పొందడం ఆయన సర్వీస్కు వచ్చినటువంటి గుర్తింపు లయనిజంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ దీపక్ భట్టాచార్జి చే నిబద్ధత కలిగిన అధ్యక్షుడిగా గుర్తింపు పొందాడు. అదేవిధంగా ఉపాధ్యాయులకు విద్యాశాఖ నిర్వహించే అంతర్గత ట్రైనింగ్స్ ల లో జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్ గా(డి ఆర్ పి) ఎంతో మంది ఉపాధ్యాయులకు ఆహ్లాదకరమైన ఆరోగ్యవంతమైన అసక్తికరమైన శిక్షణలను కూడా అందించడం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య బెస్ట్ డి ఆర్ పి కూడా గుర్తింపు పొందారు. ఈ విధంగా ఒక వైపు విద్యార్థిని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ పాఠశాలలో భౌతిక వసతుల కల్పనకు కృషి చేస్తూ మరొకవైపు సామాజిక రంగంలో రుగ్మతలను రూపుమాపడానికి జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కన్వీనర్ గా ఎన్నో సంవత్సరాలుగా శాస్త్రీయతను పెంపొందించడానికి చెకుముకి వంటి టాలెంట్ పరీక్షలను నిర్వహించడం అభినందనీయం బాల్యవివాహాలను నిర్మూలించడానికి పర్యావరణాన్ని రక్షించడానికి ప్లాస్టిక్ ని నిర్మూలించడానికి నివారించడానికి ఎంతో మంది అనాధలకు అనార్థులకు అవసరార్థులకు సేవలందించినటువంటి యాకయ్య గారు చాలా సందర్భాలలో తన ఆధ్వర్యంలో మానవత్వాన్ని ప్రదర్శించి ఎంతోమందికి ఆపత్కాలంలో ఆదుకున్న మానవతావాది యాకయ్య రాబోయే కాలంలో మరిన్ని మంచి సేవలు అందించి హై స్కూల్ విద్యార్థుల కూడా ఉత్తమమైన విద్యను బోధించి మరింత గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి జలగం శ్రీనివాస్ గౌడ్ కోశాధికారి బాలగాని నరసయ్య గౌడ్ గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్ సంఘ గౌరవ సభ్యులు దూలం శ్రీనివాస్ గౌడ్ తాళ్ల పెల్లి హేమాద్రి గౌడ్ మోడెం వెంకన్న గౌడ్ సోమ నరసయ్య గౌడ్ చీకటి వెంకన్న గౌడ్ పులి ముత్తిలింగం గౌడ్ రావుల సదానందం గౌడ్ కుంభం జగన్నాథం గౌడ్ నాగపురి అశోక్ గౌడ్ రావుల యాదగిరి గౌడ్ కోటగిరి కుమార్ గౌడ్ నిమ్మల శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కోలీవుడ్‌లోనూ క్యాస్ట్ కౌచింగ్: సనమ్ శెట్టి



క్యాస్టింగ్ కౌచ్ అంశం వెలుగులోకి వచ్చి బాగా చర్చనీయాంశం అవుతుంది. తాజాగా ఇప్పుడు తమిళ నటి, బిగ్ బాస్ బ్యూటీ సనమ్ శెట్టి కోలీవుడ్‌లోనూ క్యాస్టింగ్ కౌచ్ ఉందంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. దర్శక నిర్మాతల నుంచి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రెస్‌మీట్ పెట్టి మరీ వాపోయింది. టెక్నికల్‌గా సమాజం ఎంత మారినా, మహిళలు ఎన్ని ఉన్నత చదువులు చదివినా అన్ని రంగాల్లోనూ మహిళలకు వేధింపులు తప్పట్లేవన్నారు. ఇటీవలే మలయాళ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌పై జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక గురించి తెలిసి నేను షాకయ్యానని.. అక్కడ ఉన్న అదేవిధమైన పరిస్థితులు తమిళ చిత్ర పరిశ్రమలోనూ ఉన్నాయని పేర్కొంది. ఇక్కడ జరుగుతున్న అకృత్యాలను బయటపెట్టడానికి ఎవరూ ముందుకు రారని.. నేనూ ఇలాంటి చేదు సంఘటనలు ఎదుర్కొన్నా అన్నారు.ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు.. ఎందుకు మాట్లాడారని చాలామంది అడుగుతున్నారన్నారు.

దీంతో అప్పటి పరిస్థితుల రీత్యా కొన్నిసార్లు బయటకువచ్చి మాట్లాడలేక పోతున్నామని సనమ్ తెలిపింది. అయితే.. కొద్ది రోజుల క్రితం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఉదంతం అనంతరం సనమ్ షెట్టి తన సోషల్ మీడియా వేదికగా వరలక్ష్మి వత్రం సందర్భంగా ఓ వివాదాస్పద వీడియోను షేర్ చేసింది. మహాలక్ష్మి దేవి పూజను అందరూ జరుపుకుంటున్నామని.. కానీ మన మధ్య నడిచే దేవతలు అత్యాచారానికి, హత్యలకు గురవుతా రని, ప్రాణాలు కాపాడే దేవదూత లాంటి ఓ డాక్టర్‌ను అనాగరికంగా హత్య చేస్తే.. కోల్‌కతాలో రీలకెయిమ్‌ది నైట్ అనే ఉద్యమాన్ని ప్రారంభించారు. నేను దానిని చెన్నైలో క్లెయిమ్ ది నైట్‌గా ప్రారంభించాలనుకుంటున్నా అన్నారు. ఈ నిరసనలో నాతో కలిసి బాధితురాలికి న్యాయం చేయడంలో సాయం చేయాలని కోరుతున్నానని శెట్టి ఈ సందర్భంగా తెలిపారు.



# రాముడి పాత్రధారికి ప్రశాంత చిత్తం అవసరం

నితేశ్ తివారీ దర్శకత్వంలో బాలీవుడ్ అగ్ర నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ ప్రతిష్ఠాత్మకంగా రామాయణాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'రామాయణ' పేరుతో ఇది రానుంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్‌కపూర్ రాముడిగా కనిపించనున్నారు. అయితే, రాముడిగా ఈ హీరోనే ఎంపిక చేసుకోవడంపై తాజాగా బాలీవుడ్ దర్శకుడు ముఖేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాముడి పాత్ర పోషించాల్సినవారికి ఉండాల్సిన ప్రధాన లక్షణం ప్రశాంతత. రణ్‌బీర్ ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటారు. అందుకే నితేశ్ తివారీ అందరికంటే అతడిని ముందుగా ఎంపిక చేశారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపిక సరైనదని సినిమా చూశాక ప్రేక్షకులకు కచ్చితంగా అర్థమవుతుంది. నేను రణ్‌బీర్‌తో కలిసి చాలా ప్రాజెక్ట్‌లకు వర్క్ చేశాను. నటనలో ఆయనతో ఎవరూ పోటీ పడలేరు. సినిమా జయాపజయాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలా ఉంటాడు' అంటూ రణ్‌బీర్‌పై ముఖేశ్ ప్రశంసలు కురిపించారు. ఇందులో అగ్రనటీనటులు భాగం కానున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్, కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్ సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. 3 భాగాలుగా దీన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. మొదటి పార్ట్‌ను 2025 దీపావళికి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక దీని వీఎఫ్‌ఎక్స్ ఎఫెక్ట్‌ల కోసం నితేశ్ తివారీ టీమ్ ఆస్కార్ విన్నింగ్ కంపెనీ డీఎన్ఈజీ (అఔఇఉ)తో సంప్రదింపులు జరిపిందట. ఈ సినిమాకు తెలుగు వెర్షన్ సంభాషణలు రాసే బాధ్యతను చిత్ర బృందం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కు అప్పగించినట్లు సమాచారం.

# పుష్ప-2పై రూమర్స్ కంటిన్యూ




ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం పుష్ప-2 క్రియేటివ్ దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. పుష్పరాజ్‌గా మొదటిపార్ట్‌తో అల్లు అర్జున్ తన నటనతో, సుకుమార్ తన టేకింగ్‌తో ఎంతటి సన్సేషన్ సృష్టించారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచి రవిశంకర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రం నుంచి ఇప్పటి వరకు వచ్చిన రెండు సాంగ్స్ చార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. అంతేకాదు ఈ సినిమా నుంచి వదిలిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు కూడా అనూహ్య స్పందన వచ్చింది. మొదటగా ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేద్దామనుకున్నారు. అయితే చిత్రీకరణ బ్యాలెన్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పెండింగ్‌గా వుండటంతో డిసెంబర్ 6కు చిత్ర విడుదలను వాయిదా వేశారు. ఇక అప్పటి నుంచి ఈ చిత్రంపై పలు రూమర్స్ వస్తున్నాయి, అల్లు అర్జున్, సుకుమార్‌ల మధ్య గొడవలు, ఈ సినిమా మళ్లీ వాయిదా వేస్తారు. సమ్మర్‌కు రిలీజ్ చేశారు. అంతేకాదు మెగాస్టార్ ఫ్యామిలీకి, అల్లు ఫ్యామిలీకి మనస్పర్థలు వచ్చాయని అల్లు అర్జున్ తన ఫ్రెండ్ కోసం వైసీపీ అభ్యర్థిని సపోర్ట్ చేయడంతో బన్నీని మెగా క్యాంప్ దూరం పెట్టిందని ఇలా రకరకాల ప్రచారాలు వున్నాయి. అయితే ఇవన్నీ అసత్య ప్రచారాలన్నీ పలు సార్లు మెగాస్టార్ కాంపౌండ్, అల్లు ఫ్యామిలీ వాళ్లు చెప్పినా.. రూమర్స్ ఆగడం లేదు.

# టాలెంట్‌కు వేదికగా సోషల్ మీడియా..

## ఇమాన్వీ ఎంపికపై హను రాఘవపూడి



ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా కోసం కథానాయికగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ ఎస్మాయిల్‌ను చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో కథానాయికగా ఆమెను ఎంచుకోవడంపై దర్శకుడు హను రాఘవపూడి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల వల్ల కొత్త టాలెంట్‌ను వెతికి పట్టుకోవడం సులభ మైందన్నారు. ప్రస్తుతం ఉన్న రోజుల్లో కొత్త టాలెంట్‌ను వెలికి తీయడంలో సామాజిక మాధ్యమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. తమ కథకు అనుగుణంగా నటీనటులను ఎంపిక చేసుకోవడంలో ఫిల్మ్‌మేకర్స్‌కు సోషల్‌మీడియా ఎంతో సాయం చేస్తుంది. ఇమాన్వీ అందం, ప్రతిభ కలిగిన అమ్మాయి. అందరిలాగానే నేనూ ఆమె డ్యాన్స్ వీడియోలు చూస్తుంటా. ఆమె మంచి భరత నాట్యం డ్యాన్సర్. కళ్లతోనే ఎన్నో హావభావాలను పలికిస్తుంటుంది. అందుకే ఆమెకు ఒక అవకాశం ఇవ్వాలనుకున్నా అని హను చెప్పారు. ఆడిషన్స్, స్క్రీన్ టెస్ట్ అనంతరమే ఆమెను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఆమెను సెలెక్ట్ చేయడం తన ఒక్కడి నిర్ణయం కాదని.. చిత్రబృందం మొత్తం నిర్ణయమని ఆయన తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. ఇటీవల ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగింది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇమాన్వీ విషయానికి వస్తే.. ఇన్‌స్టాగ్రామ్ స్టార్‌గా ఆమె యువతకు సుపరిచితురాలు. హిందీతో పాటు, తెలుగు, తమిళ పాటలకూ ఆమె వేసే స్టెప్‌లు ఎంతగానో అలరిస్తాయి. దాదాపు 7 లక్షల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ సినిమా ప్రకటించిన తర్వాత ఆ సంఖ్య మరింత పెరిగింది.

